'ఉపాధి' కూలీలకు సదుపాయాలు కల్పించాలి

కెవిబిపురం : మండలంలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ అన్నారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ వామపక్ష పార్టీలు 2005లో గ్రామీణ ప్రాంతాల నిరుపేద యువకుల వలసల నివారణ అరికట్టేందుకు చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. అయితే ఈ చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నీరుగారుస్తోందన్నారు. తాజాగా బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి నిధుల కోత విధించిందన్నారు. కూలీలు పనులు చేసే చోట టెంట్లు, మజ్జిగ, మెడికల్ కిట్‌లు అందజేయాలని, జాబ్‌కార్డులకు అతీతంగా పనులు కల్పించాలని, రోజుకు రూ.600 రూపాయలు కూలి ఇవ్వాలని, ప్రతి కూలికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, కన్నెమ్మ, బాలయ్య, గురునాథం, నాగూరయ్య పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా వైసిపిలో...

మూడు 'రిజర్వ్‌డ్'లోనూ మార్పే..!

సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరుల్లో కొత్తవారే
గూడూరునుంచి 'ఆర్డీవో' కిరణ్‌కుమార్ పోటీ..?
సూళ్లూరుపేట నుంచి ఓ ప్రముఖ డాక్టర్ పేరు

తిరుపతి జిల్లాలో మూడు రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేల మార్పు ఖాయమని సమాచారం. సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరు నియోజక వర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేల పనితీరుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర అసంతప్తిగా ఉన్నారని తెలుస్తోంది. ఎన్నికలు ఇంకా ఏడాదే ఉండడంతో అభ్యర్థుల ఎంపికపై సీఎం జగన్ తీవ్రంగా కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. వివిధ సంస్థల సర్వే నివేదికల ఆధారంగా సిట్టింగ్ ఎమ్మెల్యేల కొనసాగింపు, కొత్త అభ్యర్థుల ఎంపికపై ఎప్పటికప్పుడు జగన్ సీరియస్‌గా ఆలోచిస్తున్నారు. నాలుగో రిజర్వ్‌డ్ స్థానమైన జీడీనెల్లూరులో ప్రస్తుతం డిప్యూటీ సిఎం నారాయణస్వామి సిట్టింగ్‌గా ఉన్నారు. అయితే నారాయణస్వామిపైనా ఆ నియోజకవర్గంలో 'రెడ్డి' సామాజికవర్గం నుంచి పూర్తి వ్యతిరేకత ఉంది. 'ఇబ్బంది పెడుతున్న వారితో ఎలా సర్దుకుపోవాలి' అని ఎస్ఆర్‌పురంలో శుక్రవారం జరిగిన గృహసారథుల సమావేశంలో ఆయన ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. అయితే నారాయణస్వామిని నియోజకవర్గంలో మార్పు చేయకపోయినా వ్యతిరేకవర్గం నుంచి ఆ పార్టీకి ఇబ్బందనే చెప్పవచ్చు.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లాకు సంబంధించి మూడు నియోజకవర్గాలపై సీఎం జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్‌ను మార్చడానికి జగన్ నిర్ణయించుకున్నారు. అలాగే కొత్త అభ్యర్థిగా గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్‌ను నిలబెట్టనున్నారు. అందుకే క్షేత్రస్థాయిలో ప్రజానీకానికి పరిచయం కావడంతో పాటు వారికి చేరువ అయ్యేందుకు ఆర్డీవోగా పంపినట్టు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. గూడూరు ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తూనే చాప కింద నీరులా రాజకీయ కార్యకలాపాలు చేసుకోవాలని కిరణ్‌కుమార్‌కు వైసీపీ పెద్దలు దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం ఆయన అదే పనిలో ఉన్నారని సమాచారం. తాజాగా కోటలో ఆక్రమణల విషయంలోనూ ఎంఎల్ఎ వరప్రసాద్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక వైసిపి నేతలు శుక్రవారం రోడ్డుపైనే నిలదీయడం గమనార్హం.

ఇక సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకూ కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ కార్యకర్త మొదలుకుని, మండల, నియోజకవర్గ స్థాయి నాయకుల వరకూ అందర్నీ ఆయన అనుమానించే పరిస్థితి. దీంతో నియోజకవర్గంలో సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. దీంతో సూళ్లూరుపేట కొత్త అభ్యర్థిగా తిరుపతికి చెందిన ఒక డాక్టర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. వైసీపీ పెద్దల సూచన మేరకు సదరు వైద్యుడు ఆ నియోజకవర్గంలో తరచూ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారని తెలిసింది.

సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలాన్నీ మార్చనున్నారు. టీడీపీలో గ్రూప్ రాజకీయాలు ఉన్నప్పటికీ ఎంతో ముందుగా అభ్యర్థిని ప్రకటించడం గమనార్హం. టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె హెలెన్‌ను ప్రకటించారు. ఈమెపై నియోజక వర్గంలో పాజిటివ్ టాక్ వినిపిస్తోంది. ఆదిమూలం స్థానంలో ఇద్దరి ముగ్గురి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిలో ఒక వైసీపీ ప్రజాప్రతినిధి పేరు కూడా వుండడం గమనార్హం. ఏది ఏమైనా ఈ మూడు చోట్ల వైసీపీ అభ్యర్థుల్ని మారిస్తేనే గెలుపు అవకాశాలు మెరుగుపడతాయన్నది అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆలోచన.

వైసిపి స్టిక్కర్ల వివాదం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'జగనన్నే మా నమ్మకం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా గడప గడపకూ స్టిక్కర్లను అంటించే కార్యక్రమాన్ని వైసిపి చేపట్టింది. ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో తీవ్ర ఓటమిని చవిచూసిన ఆ పార్టీ ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు ఇంటింటికి స్టిక్కర్లను అతికించే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించింది. అయితే ఆదిలోనే ఆ పార్టీ శ్రేణులకు స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 'గడప గడపకూ ఎంఎల్ఎ' కార్యక్రమంలో అమ్మఒడి, ఆసరా, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాల్లో తమకు అన్యాయం జరిగిందని, దీన్ని పరిష్కరించాలని ప్రశ్నిస్తున్నారు. సంక్షేమ పథకాలు తీసుకున్న లబ్దిదారులు సైతం తమ ఇంటి ముందు రోడ్ల పరిస్థితి ఏంటి? వీధి లైట్లు ఎక్కడ? డ్రైనేజి కంపు కొడుతోంది అంటూ ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. చేసిన పనులకు నిధులు ఇవ్వకుండా వడ్డీలకు అప్పు తెచ్చి బిల్లులు రాక చక్రవడ్డీలు కట్టుకుంటున్నామని స్థానిక ప్రజాప్రతినిధులు ఏం మొహం పెట్టుకుని ప్రజల వద్దకు వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యతిరేకత వ్యక్తమవుతున్న ఉద్దేశ్యంతోనే అటు మంత్రులు గానీ, స్థానిక ఎంఎల్ఎలు వైసిపి స్టిక్కర్లను అతికించే కార్యక్రమానికి పెద్దగా చొరవ చూపలేదని బహిరంగ రహస్యమే. కేవలం కార్యక్రమ ప్రారంభ సూచికగా వైసిపి శ్రేణుల, కార్యకర్తల ఇళ్ల వద్దనే ఆర్భాటం చేస్తున్నట్లు విమర్శలున్నాయి. తాజాగా తిరుపతిలోని వార్డుల్లో రాజకీయాలకు అతీతంగా ఉన్న ప్రజలు మాత్రం 'మీ స్టిక్కర్లు మా ఇళ్లకు అతికించొద్దు' అంటూ మొహానే చెప్పి పంపిస్తున్నారు. ఎలాగైనా ఈ పథకాన్ని విజయవంతం చేసి జగన్ ముందు నంబర్ వన్‌గా నిలిచేందుకు ఇచ్చిన స్టిక్కర్లన్నీ అంటించేయాలని వాలంటీర్లకు అప్పగించి మమా అనిపిస్తున్నారు. ముఖ్యంగా తిరుపతిలో పరిశీలిస్తే ఇళ్ల కంటే షాపులకు అతికించడం కనిపించింది. అయితే జనసేన మాత్రం బహిరంగంగానే వైసిపి స్టిక్కర్ల కార్యక్రమాన్ని అడ్డుకుంటోంది. జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్, నాయకులు రాజారెడ్డి బృందం ఎక్కడైతే జగన్ స్టిక్కర్లు అతికించారో అక్కడికి వెళ్లి 'మాకు నమ్మకం లేదు జగన్.. మా నమ్మకం పవన్' అంటూ వైసిపి స్టిక్కర్ పక్కనే అతికిస్తూ నిరసన తెలుపుతున్నారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నందుకు అధికార పార్టీ జనసేన నాయకులపై కేసులు బనాయించేందుకు సమాయత్తం అవుతోంది. చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం, చంద్రగిరి, పాకాల, యర్రావారిపాళెం మండలాల్లో వాలంటీర్లను జగన్ మా ఊరికి ఏం చేశారని ఈ స్టిక్కర్లు అతికిస్తున్నారంటూ ప్రశ్నిస్తుండటం గమనార్హం. అయితే వాలంటీర్లు మాత్రం తాము ప్రభుత్వ ఉద్యోగులమని, ప్రభుత్వం ఏం చెబితే అది చేయాలి అని నిస్సహాయంగా మాట్లాడటం కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రైతులు మాత్రం ఎన్నికల ముందు ప్రతి ఎకరాకు నీరు ఇస్తామని హామీ ఇచ్చిన జగన్, అధికారంలోకి వచ్చాక మాట తప్పి మడమ తప్పారని నిలదీస్తున్నారు. జిల్లాలో శాశ్వత నీటి ప్రాజెక్టులేమీ లేకపోవడంతో గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల మాట నీటి మూటేనా అని మండిపడుతున్నారు. రహదారుల పరిస్థితి దయనీయంగా మారిందని, వర్షం వస్తే వాగులు వంకల్లా తయారవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా వైసిపికి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ఎదురుగాలి వీస్తోంది. ఈనెల 20 వరకూ ఏ విధమైన నిలదీతలు ఉంటాయో వేచి చూడాల్సిందే.

అభివృద్ధి పథంలో నడిపేందుకు కలెక్టర్ కృషి

డిప్యూటీ సిఎం నారాయణ స్వామి

జిల్లా కలెక్టర్ ను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాను అభివద్ధి పథంలో ముందుకు నడుపుతూ అన్ని రంగాలలో మొదటి స్థానంలో నిలిపేందుకు జిల్లా కలెక్టర్‌గా ఎం.హరినారాయణన్ చేసిన సేవలు మరువలేనివి అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి తెలిపారు. శనివారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి కలెక్టరును క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న జిల్లా కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన అన్ని కార్యక్రమాల అమలులో జిల్లాను అగ్రస్థానంలో నిలపడంలో కలెక్టర్ కషి మరువలేనిది అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు గహనిర్మాణాలు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ నిర్మాణ పురోగతితో పాటు అనేక పథకాలను అర్హులైన వారికి చేర్చడంలో ప్రభుత్వ ఆశయాలను ప్రతిబింబించే విధంగా అధికారులతో పనులు చేయించడంలో జిల్లా కలెక్టర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏ పథకం, ఏ అభివద్ధి పనులు చేపట్టినా ముందుగా జిల్లాలో ప్రవేశ పెట్టడంతో పాటు ఆ పథకాలను అధికారుల ద్వారా మొదటిస్థానంలో నిలపడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

అన్నదాన సిబ్బంది చేతివాటం

ప్రజాశక్తి-ఐరాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో అన్నదాన సత్రం పోటు నుండి సరుకులను అక్రమంగా తరలిస్తూ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. సుమారు రూ.1.5 లక్షలు విలువచేసే సరుకులు నిత్యాన్నదాన సత్రం స్వామివారి ప్రసాదం తయారీ పోటు నుంచి తరలించినట్లు ఆలయ ఈవో ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున జరిగిన దాడుల్లో బయటపడ్డాయి. ఈ వివరాలను ఆలయ ఈవో వెంకటేశుమీడియా సమావేశంలో వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవస్థానం అన్నదాన భవన్‌లో పనిచేసే వంట మనుషులు, ఆలయ ప్రసాదం పోటులో పనిచేసే బ్రాహ్మణులతో కలిసి ఏడు మంది ఈ సరుకులను అక్రమంగా తరలించి వారి ఇండ్లలో నిల్వ ఉంచగా, ఆలయ సిబ్బందితో కలిసి వారి ఇళ్లలో దాడులు చేసి అక్రమంగా తరలించిన సరుకులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అలాగే వరదరాజ స్వామి, వీరాంజనేయ స్వామి ఆలయాల్లో అర్చకుడిగా పని చేస్తున్న కష్ణమోహన్ ఇంటిపై తనిఖీలకు వెళ్లగా రెండు జింక చర్మాలు పట్టుబడినట్లు తెలిపారు. అనంతరం వీటిని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సంఘటనకు పాల్పడిన ఏడుగురిపై విచారణ అనంతరం శాఖా పరమైన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో ఏఈఓ లు రవీంద్రబాబు, హేమమాలిని, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎస్‌టియు నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకన కేంద్రాల్లో ఉపాధ్యాయులకు అన్ని సదుపాయాలు కల్పించాలని, మూల్యాంకనానికి 60 ఏళ్ల దాటిన ఉపాధ్యాయులు, గర్భిణులు, చంటిబిడ్డల తల్లులు, వ్యాధులతో సతమతం అవుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలని, అవసరమైన మేరకు ప్రత్యేక సహాయకులను నియమించాలని, చిత్తూరు జిల్లా కేంద్రానికి సమీపంలో నివశిస్తూ దూర ప్రాంతాలలో పని చేస్తున్న వారిని సహాయకులుగా నియమించడానికి చర్యలు తీసుకోవాలని, ఉన్నత పాఠ శాలలో బోధించుటకు అర్హులను సర్దుబాటు చేస్తూ ఫిబ్రవరిలో పంపిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల నెలవారి అధనపు అలవెన్స్ 2500 రూపాయలు చెల్లించేందుకు గాను చర్యలు తీసుకోవాలని ఎస్‌టియు చిత్తూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెద్ద రెడ్డి దేవరాజులు రెడ్డి, మోహన్ లు జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి ఈమేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసు కుంటానని తెలియజేశారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి మదన్ మోహన్ రెడ్డి, ఎస్‌టియు నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే

అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యక్రమాలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో ప్రతి ఇంటినీ పలకరించేలా రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం దాదాపు ఏడాదిగా సాగుతోంది. ఈ కార్యక్రమం ఎంఎల్‌సి ఎన్నికలు, శాసన సభ సమావేశాలతో అనుకున్న మేరకు పూర్తి కాకముందే మా భవిష్యత్తు మీరే-మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం శుక్రవారం నుండి ప్రారంభమైంది. మరో వైపు ఇదేం ఖర్మ రాష్ట్రానికి అంటూ ప్రధాన ప్రతిపక్ష నేతతో సహా తెలుగుదేశం శ్రేణులు ప్రతి గడపా తొక్కుతూ అధికార పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నారు. యువనేత తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చిత్తూరు జిల్లా కుప్పం నుంచి ప్రారంభిం చారు. అధికార ప్రతిపక్ష పార్టీలు నాలుగేళ్ళుగా గుర్తుకు రాని జనం ఇప్పుడే గుర్తొచ్చురా అంటే దగ్గర్లో శాసన సభ ఎన్నికలు రానున్నాయి. ఓటర్లు ఎవ్వరు అధికారంలో ఉండాలి. ఎవరు ప్రతిక్షంలో ఉండాలో తేల్చాల్సిన సమయం దగ్గర పడింది. అందుకే అధికార, ప్రధాన ప్రతిపక్షం పోటాపోటీగా కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. ఎం ఎల్‌సి ఎన్నికల విజయంతో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం వచ్చింది. పేరుకే అధికార పార్టీ నాయకులం ప్రాధాన్యత అంతంత మాత్రమే అంటూ కొందరు వైసీపీ దిగువశ్రేణి నాయకులు పార్టీ అధిష్టానంపై పెదవి విరుస్తున్నారు. కనీసం సచివాయాల్లో కూడా అధికార పార్టీ నేత మాటకు విలువ లేదంటున్నారు. ఇదే కొట్టొచ్చినట్లు గత రెండు మూడు రోజులుగా మా నమ్మకం నువ్వే జగన్ కార్యాక్రమ సన్నాహక సమావేశాల్లో కనిపించింది. ఈ సమావేశాలకు దిగువశ్రేణి నాయకులు డుమ్మా కొడుతున్నారు. రెండు రోజుల క్రితం పూతలపట్టు నియోజకవర్గ సమావేశంలో చిత్తూరులోని రెడ్డిగుంట బైపాస్‌లోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో నిర్వహించారు. నియోజకవర్గ ముఖ్య నేతలు మినహా మిగిలిన ప్రజా ప్రతినిధులు, నాయకులు డుమ్మా కొట్టారు. సమావేశానికి వచ్చిన నేతలు కూడా చివరి వరకు సమావేశంలో ఉండలేదు. ఈ విషయం ఎంఎల్‌ఎకి ఆగ్రహం తెప్పించింది. మరో వైపు చిత్తూరు నియోజకవర్గ సమావేశం కూడా అంతత మాత్రమే.

మా నమ్మకం నువ్వే జగన్

మా నమ్మకం నువ్వే జగన్ అంటూ జనంలోకి వెళ్లాలని అధికార పార్టీ భావిస్తోంది. ప్రతి ఇంటికీ స్థానిక ప్రజా ప్రతినిధులు, గృహ సారధి, సచివాలయ కార్యదర్శి, వార్డు వాలంటీర్ వెళ్లి ఈ నెలుగేళ్లకాలంలో ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలను వివరిస్తారు. ఆ కుటుంబానికి కలిగిన ప్రయోజనాన్ని తెలపడంతో పాటు ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నట్లు బ్రోచర్‌లో సంతకం పెట్టాల్సి ఉంటుంది. ఇంటి యజమాని ఆమోదంతో ఇంటి డోర్‌కు ముఖ్య మంత్రి స్టిక్కర్ అంటించుకోవాలి. అలాగే మొబైల్ ఫోన్‌కు సిఎం జగన్ స్టిక్కర్ అంటించు కోవాలి. ఇది మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉద్దేశం. శుక్రవారం నుంచి ఈనెల 20వ తేది అంటే 14 రోజుల పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రామ పంచాయతీ, వార్డు సచివాలయాల పరిధిలో డోర్‌టూ డోర్ నిర్వహిస్తున్నారు.



మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ప్రజా మద్దతు కోరుతున్న చిత్తూరు ఎంఎల్ఏ

అసంతృప్తి ఉంటే 8296082960 టోల్ ఫ్రీకి ఫిర్యాదు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్ర మాలపై అసంతృప్తి ఉన్నా, స్థానిక ప్రజా ప్రతినిధి సక్రమంగా పని చేయకున్నా, అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకున్నా నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రికి తెలియజేసేలా టోల్ ఫ్రీ నెంబర్ 8296082960కు ఫిర్యాదు చేయవచ్చు. ఇక చిత్తూరు నియో జకవర్గం విషయానికి వస్తే 50 డివిజన్లలో 47 డివిజన్లు వైసీపీ కార్పొరేటర్లు, 17 పంచాయతీల్లో 14 పంచాయతీలు అధికార పార్టీ సర్పంచ్‌లు, ఏడు ఎంపీటీసీల్లో వైసీపీ అభ్యర్థులున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నియోజకవర్గాల్లో ఏ విధంగా జరుగుతోందో ఎప్పటికప్పుడు ప్రశాంత్ కిషోర్ నిఘా కమిటీ పరిశీలించనుంది. ఏది ఏమైనా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార పార్టీ ఈ కార్య క్రమం ముగిసిన తరువాత ఈనెల 20 తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజా మద్దతు సర్వే రిపోర్టులు పరిశీలించి ఏప ప్రజా ప్రతినిధి పాల్గొన్నా, పొల్గొనని వారు ఎందుకు పాల్గొనలేదు అనే విషయాలపై ఆరా తీసి చర్యలు తీసుకోనున్నట్లు ఆ పార్టీ ముఖ్య నేతలు బహి రంగా చెబుతున్నారు. ప్రజా ప్రతినిధుల బలంతో వచ్చే ఎన్నికల్లో విజయం తమదేనంటూ అధికార పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తుంటే జగన్ పనైపోయింది. ఇందు తార్కాణం ఎంఎల్‌సి ఎన్నికలే. ఎన్నికల ముందు అధికార పార్టీలో జంప్ జిలాణీలు ప్రజా మద్దతు తమకే ఉందంటోంది ప్రధాన ప్రతిక్ష నేతలు.

దళితుల భూముల్లో పెత్తందారులు పాగా

బాలాయపల్లి : సర్వే నంబర్ 165-1పి4లో 11 ఎకరాల దళితుల సాగు భూమిలో పెత్తందారులు పాగా వేశారని సిపిఎం, సిఐటియు నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య మండిపడ్డారు. శనివారం బాలాయపల్లి మండలం అంబలపూడి దళితవాడలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల భూములను పెత్తందారులు ఆక్రమించుకున్నారని, 2020 నుంచి విన్నవించుకుంటున్నా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కార్యాలయాల చుట్టూ దళితులు తిరిగి తిరిగి అలిసిపోయారని, సోమవారం గూడూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేస్తామని హెచ్చరించారు. దళితులకు భూములు దక్కేంతవరకూ పోరాటం సాగిస్తామన్నారు.

సిపిఎస్ రద్దుకు చర్యలు తీసుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి

ప్రజాశక్తి-పలమనేరు: ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి తీవ్ర మనోవేదన కలగజేస్తున్న సిపిఎస్ విధానాన్ని రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో యుటిఎఫ్ పలమనేరు డివిజన్ సమా వేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బాబురెడ్డి విచ్చే శారు. అనంతరం బాబురెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని మాట ఇచ్చి, ఇంతకాలం గడుస్తున్నా రద్దు చేయక పోవడం సరికాదన్నారు. దేశంలో పంజాబ్, రాజస్థాన్, ఝార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. కేంద్రప్రభుత్వం సిపిఎస్ రద్దు విధానంలో తగు మార్పులకు కమిటీ వేసిన తరుణంలో, రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ రద్దుకు పూనుకోకపోవడం సరికాదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి మీగడ. వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 55 వేల ఉపాధ్యాయ పోస్టులు దాదాపుగా ఖాళీ ఉంటే, విద్యాశాఖా మంత్రి 1000 లోపు మాత్రమే ఖాళీలు ఉన్నాయనడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క డీఎస్సీ నిర్వహించకపోవడంతో ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోందన్నారు. తక్షణమే డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిపి.ప్రకాష్, జిల్లా కోశాధికారి కె.ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శి ఎ.కష్ణమూర్తి, సీనియర్ నాయకులు ఆర్.గురుమూర్తి, పాపయ్య, నాగభూషణం, పురుషోత్తం, డివిజన్ నాయకులు భాస్కరయ్య, గుణశేఖర్ రెడ్డి, ఎంసి.నిర్మల, శశికుమార్, నాగభూషణం, శ్రీనివాసులు, సుబ్ర మణ్యం, మురళీ కష్ణ, ప్రజా సంఘాల నాయకులు గిరిధర్ గుప్తా, రాజా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాబురెడ్డి

నగరంలో ట్రాఫిక్ స్థిరీకరణకు శాశ్వత చర్యలు

ట్రాఫిక్ నియంత్రణ మార్గాలను అన్వేషిస్తున్న నగర కమిషనర్, చిత్తూరు డీఎస్పి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులతో కలిసి చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ జె అరుణ చెప్పారు. శుక్రవారం రాత్రి కమిషనర్ చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామితో కలిసి గాంధీ విగ్రహం కూడలిలో చేపడుతున్న పనులను పరిశీలించారు. నగరంలోని గాంధీ విగ్రహ కూడలి, ఎమ్మెస్సార్ కూడలి, చౌడేశ్వరమ్మ టెంపుల్ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, రహదారులపై ట్రాఫిక్ మార్కింగ్, జీబ్రా క్రాసింగ్, ఫ్రీ లెఫ్ట్ మార్కింగ్ ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌ను సులభతరం చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి దశలవారీగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్

తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హరినారాయణన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలోని అతిపురాతనమైన, ప్రముఖమైన శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్చి 29 నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు అతి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం శ్రీ సీతారాముల తిరు కల్యాణోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ స్వామివారికి భక్తి ప్రపత్తులతో పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు మంగళ వాయిద్యాలనడుమ దేవస్థానం అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ సీతా రాముల వారిని కలెక్టర్ దర్శించుకున్నారు. ఆయనకు వేద పండితులు ఆశీర్వాదంతో తీర్థ ప్రసా దాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ వెంట ఈఓ సుబ్రహ్మణ్యం నాయుడు, గ్రూప్ టెంపుల్ మేనేజర్ చెంగల్ రాయుడు, ఆలయ ఛైర్మన్ వెంకటేష్ గుప్తా, ముఖ్య అర్చకులు వేణుగోపాలస్వామి, ధర్మకర్తలు రాజా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత నిరసన

అరెస్టులను నిరసిస్తూ అందోళన చేస్తున్న తెలుగు యువత

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామంటూ యువతను మోసం చేశాడంటూ తెలుగుయువత రాష్ట్ర నాయకులు వరుణ్ నేతృత్వంలో శనివారం స్థానిక దర్గా సర్కిల్ ఎదుట తెలుగు యువత రాస్తారోకోకు పూనుకుంది. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టూ టౌన్ ఎస్ఐ నిరసనకారులను అదుపులోకి తీసుకొని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్ ఎదుట అరెస్టులకు నిరసనగా తెలుగుయువత నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు వరణ్ మాట్లాడుతూ అధికారం కోసం ఉద్యోగం, ఉపాధి పేరుతో మోసం చేసిన జగన్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో యువత గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మద్యం ఏరులై పారుతుంటే మరో వైపు యువతను మత్తులో ముంచేలా గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పట్టుబడుతున్న మత్తు పదార్థాలు ఇందుకు నిదర్శనమన్నారు.

బడుగు బలహీన వర్గాల అభివృద్ధే సీఎం లక్ష్యం

డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణ స్వామి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే జగనన్న లక్ష్యమని రాష్ట్ర డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం ఎస్ఆర్ పురం మండలంలోని వివి పురం గ్రామ పంచాయతీ గంగమ్మ గుడి, వంటిల్లు, ఆరిమాకులపల్లి గ్రామాలలో రాష్ట్ర డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ తనయుడు దామోదర నాయుడు, నాయకులు, కార్యకర్తలు గడపగడపకు మన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు అందించడమే జగనన్న లక్ష్యం అని ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను పేదల కోసం చేపట్టారన్నారు. ఆరిమాకులపల్లి గ్రామస్తులు మా గ్రామానికి తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని, ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం కేటాయించాలని డిప్యూటీ సీఎంకి వివరించడంతో వెంటనే లబ్ధిదారులు కావలసిన ఇంటి స్థలాలను గుర్తించాలని రూ.17 లక్షలతో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, మాజీ జడ్పిటిసి గురువారెడ్డి, మండల అధ్యక్షులు మణి, నాయకులు జనార్ధన్, మణి, హరి ప్రసాద్ రెడ్డి, నియోజకవర్గ మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: రాష్ట్రంలోని పేదవారికి మరింత దగ్గరగా గ్రామాల్లోనే ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ శ్రీకారం చుట్టారని పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ అన్నారు. శనివారం కొళత్తూరు సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నేలపల్లి, కొళత్తూరు, చదళ్ళవారిపల్లి, గూబగుండ్లపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు 667 గృహాలను సందర్శించారు. ఎంపీపీ రెడ్డప్ప, స్థానిక సర్పంచ్ రవికుమార్, మార్కెటింగ్ ఛైర్మన్ హేమంత్ రెడ్డి, మండల కన్వీనర్ బాగారెడ్డి, ప్రహ్లాద, సింగిల్ విండో ఛైర్మన్ ఓబుల్ రెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి కార్యకర్తలు, పంచాయతీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఛాంపియన్‌కు సన్మానం

ప్రజాశక్తి-విజయపురం: జాతీయస్థాయి ఛాంపియన్ షిప్‌లో వెండి పతకం సాధించిన రాహుల్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు ఆర్కే రోజా శనివారం విజయపురం మండలం వైసీపీ క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. వివరాలు..విజయపురం మండలం నారపరాజు కండ్రిక గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శోభ రామకష్ణమరాజు దంపతుల కుమారుడు రాహుల్. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దివాస్ నగరంలో గత ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని విజయం సాధించడం చాలా సంతోషంగా ఉందని రోజా తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయపురం మండలం వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే విజయపురం అభివృద్ధి

సమిష్టి కృషితోనే విజయపురం అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కె.రోజా అన్నారు. శనివారం విజయపురం మండలం జనరల్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విజయపురం మండలంలోని గడపగడపలో మం జూరైన అభివద్ధి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకి ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీ లు బాలాజీ, దశరథ, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-యాదమరి: గర్భవతులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిహెచ్ఓ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని బుడితిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ మాట్లాడుతూ మాతా శిశుమరణాలు పూర్తిగా నివారించేందుకే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రతి గర్భిణి, చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు అందించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందన్నారు. అలాగే గర్భిణులు కనీసం నాలుగు సార్లు అయినా వైద్య పరీక్షల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు అయ్యేలా వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతినెలా గర్భిణులను ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కింద గ్రామానికి వస్తున్న 104 సంచార వైద్య వాహనం వద్దకు తీసుకువచ్చి అన్ని రకాల పరీక్షలు చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి విష్ణు ప్రియ, మహిళా ఆరోగ్య కార్యకర్త విమల, ఆశా కార్యకర్త శ్రీమతి, అంగన్వాడీలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రైతులు మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని రైతన్నలు వేరుశనగ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని డిఆర్‌సి వ్యవసాయ సంచాలకులు వేణుగోపాల్, టీవీ నాగపద్మనీ తెలిపారు. శనివారం వెంగళ రాజు కుప్పం గ్రామంలో రైతు సాగు చేసిన వేరుశనగ పంటను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో నాగపద్మనీ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలని, దీంతో నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని సూచించారు. వేరుశనగ కోత, నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కత్తెర పురుగు చర్యలను తెరవగా రైతులకు వివరించారు. బిందు సేద్యం పద్ధతిలో చెరుకు పంట సాగు చేసుకోవచ్చని, డ్రిప్ సీడర్ పద్ధతిలో వరి పంట సాగు చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని, కూలీలు కూడా తక్కువే అని వివరించారు. వరిలో ఆకు ముడత, కాండము తాచు పురుగు నివారణ చర్యలు వంటిపై రైతులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: ప్రభుత్వం అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకుంటూ మొబైల్ బుక్ కీపింగ్‌ను సక్రమంగా నిర్వహించాలని ఐకెవి ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. శనివారం స్త్రీ శక్తి భవనంలో సిసి, సంఘమిత్ర, డ్వాక్రా మహిళలకు, లీడర్లకు ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివద్ధి చెందాలని సూచించారు. శ్రీనిధి, ఉన్నతి రికవరీలను పూర్తిగా వసూలు చేయాలని తెలిపారు. సిసి చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, మంజుల, శోభ, బాలయ్య, వివో లీడర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ పల్లవి అన్నారు. శనివారం మండలంలోని ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎం పురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ద్వారా గ్రామ ప్రజలకు అంగన్వాడీ కేంద్రంలో వైద్య సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ 15 రోజులకు ఒకసారి గ్రామ సచివాలయం వద్ద 16 రకాల పరీక్షలు 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ప్రాథమిక ఆరోగ్య, అంగన్వాడీ సిబ్బందులు తదితరులు ఉన్నారు.

'బిజెపివి దిగజారుడు రాజకీయాలు'

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హయాంలో బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ పై కేసు పెట్టి వారి దిగజారుడుతనానికి నిదర్శనంగా మారిందని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగా గౌతమ్, డిసిసి అధ్యక్షుడు సురేష్ బాబులు విమర్శించారు. గంగాధర నెల్లూరులో శనివారం పిసిసి మెంబర్ పోటుగారి భాస్కర్ అధ్యక్షతన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. అనంతరం భాస్కర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం పెత్తందారులకు కొమ్ముకాస్తూ వేల కోట్ల రూపాయ లను ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఏఐసీసీ మెంబర్ శంకర్, ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ సుబ్బరాయులు, పిసిసి అధికార ప్రతినిధి వెంకటరమణ బాబు, పిసిసి మెంబర్లు బుల్లెట్ రవి, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

నగరి: కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీ బలమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు జంగా గౌతమ్ అన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జంగా గౌతమ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో సీఎం జగన్ మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ఎన్నికల ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. అలాగే ప్రధాని మోడీ చెప్పేవన్నీ అబద్దాలని, రాజ్యాంగ విలువల్ని మంట కలిపి ఇష్టారాజ్యంగా మోడీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డీసీసీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, ఎఐసిసి మెంబర్లు భానుమూర్తి, శంకర్, పిసిసి మెంబర్ నటరాజ మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-కుప్పం: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక పీఈఎస్ అర్బన్ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేశారు. శిబిరానికి కుప్పం చుట్టు పక్కల గ్రామాల్లోని వద్ధులు, దీర్ఘకాలిక కంటి సమస్యలతో బాధ పడుతున్న వారు పాల్గొని సద్వినియోగం చేసుకున్నట్టు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎ.మహేష్ మాట్లాడుతూ కన్ను మనకు వెలుగు లాంటిదని ప్రపంచాన్ని మనకి పరిచయం చేస్తున్న కంటినీ ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలి అని తెలిపారు. కానీ ఇప్పుడు సాంకేతికత పెరగడంతో అధికంగా సెల్ ఫోన్లను ఉపయోగించడంతో, ఎక్కువగా టీవీలను చూడడం వల్ల దీర్ఘకాలిక కంటి సమస్యలతో బాధ పడుతున్నామన్నారు. చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత సరిపోక పేదవారు వారి కంటి చూపుని కోల్పోతున్న సంఘటనలను మన చుట్టూ ఎన్నో చూస్తున్నామని, అలాంటి వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో కుప్పం ప్రాంతంలో లయన్స్ క్లబ్ ద్వారా ఉచితంగా కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం తమకు ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. అందులో భాగంగానే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా లయన్స్ క్లబ్ సభ్యులు ప్రతి నెలా రెండవ శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వారు భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో 105 మంది కంటి సమస్యలతో బాధపడుతున్న వారు వచ్చారని, అందులో 20 మంది ఉచితంగా సర్జరీలకు పీఈఎస్ ఆసుపత్రికి వైద్యులు సిఫార్సు చేసినట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యదర్శి సోము, వైస్ ప్రెసిడెంట్ సత్యేంద్ర, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ సెల్వం, శివ, కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ గంగాధర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, పీఈఎస్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు హెచ్చరిక

ప్రజాశక్తి-నగరి: దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు అన్నారు. శనివారం దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ నగరి సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక పిసిఎన్ గ్రౌండ్‌లో సీపీఐ నగిరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశ ప్రాధాన్యతను సిపిఐ పార్టీ నగర్ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య నాయకులకు వివరించారు. కడప జిల్లాలో చనిపోయిన డాక్టర్ అచ్చన్న కుటుంబాన్ని ఆదుకుని దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైఎస్ఆర్పిపి జగన్మోహన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో దళితులపైన దాడులు విచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. మోడీ, జగన్ ప్రభుత్వాలకు పతనం తప్పదని, ఈ నెల 11వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శులు వేలన్, భాష, మురళి, రూప్ కుమార్, శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశయ్య, టీడీపీ నాయకులు శ్రీధర్, ఆర్ముగం, సిపిఎం నాయకులు పెరుమాళ్, మైలుస్వామి, ఎఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు విజయకుమార్, హరీష్, ఎఐటియుసి నాయకులు అహ్మద్, దళిత సంఘాల నాయకులు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాండూరు వివాదాస్పద భూములు పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలంలోని పాండూరు సుబ్బానాయుడు కండ్రిగలో చెన్నయ్ పురావస్తు శాఖ, సుబ్బానాయుడు కండ్రిగ పేదల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూములను సిపిఐ బృందం న్యాయ నిపుణులతో కలిసి శనివారం పరిశీలించింది. పురావస్తు శాఖ వారు తమ భూములని చెబుతున్న భూముల్లో పేదలు సాగు చేస్తున్న మిరప, వేరుశనగ పంట, నీలగిరి చెట్లు, విద్యుత్ శాఖ ఇచ్చిన విద్యుత్ సర్వీసులు తదితరాలను పరిశీలించారు. సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ ఈజిప్టు దేశంలోలా ఇక్కడ పిరమిడ్లు ఉన్నాయని, ఇక్కడ గతంలో మనుషులను పూడ్చారని, గోరీలు, శ్మశానాలు ఉన్నాయని వాస్తవ విరుద్ధమైన వాదనలు చేస్తూ అభూత కల్పనలు సృష్టిస్తున్నారన్నారు. చెన్నయ్ పురావస్తు శాఖవారు చూపుతున్న రికార్డుల ప్రకారం 1947లోనే ఈ భూములపై గెజిట్ నోటిఫికేషన్ విడుదలయ్యిందని చెబుతున్నారని, అయితే అప్పటినుంచి ఇప్పటివరకూ రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా పురావస్తు శాఖకు ఇచ్చినట్లు నమోదు చేయలేదన్నారు. రైతులకు అసైన్‌మెంట్ పట్టాలు మంజూరు చేశారని, జగనన్న కాలనీ ఈ స్థలంలోనే ఉందన్నారు. రైతుల పేర్లతోనే టెన్‌వన్ అడంగల్ రెవెన్యూ వెబ్‌లాండ్ రికార్డుల్లో ఉందన్నారు. ఎర్రమట్టి, గ్రావెల్, ఖనిజ సంపద దోచుకోడానికే పన్నాగమని విమర్శించారు. కలెక్టర్, ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, తరుణ్‌కుమార్, ధనంజయులు, సుబ్రమణ్యం, మునస్వామి, హైకోర్టు న్యాయ నిపుణులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో టీడీపీ జోక్యం లేదు

ప్రజాశక్తి-కోట: 'దశాబ్దాల తరబడి కోట పంచాయతీ మీ గుప్పిట్లో ఉన్నప్పుడు అభివృద్ధి గుర్తు రాలేదా..? ఆక్రమణల తొలగింపు గుర్తు రాలేదా..? వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక నాయకుడేమో.. ఆక్రమణ దారులతో బేరాలాడుతారు.. మరొక నాయకుడేమో ఆక్రమణలు తొలగించాలని ఆవేశంతో ఊగిపోతారు.. మీ మధ్యే సఖ్యత లేదు.. ప్రతిపక్షాలను వేలెత్తి చూపడం సబబేనా..? ఆక్రమణల తొలగింపుకు వ్యాపారస్తుల అభిప్రాయాలు అవసరంగాని ప్రతిపక్షాల జోక్యం అవసరమా..? అంటూ తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ప్రశ్నించారు. శనివారం ఆక్రమణల తొలగింపు వివాదంలో ప్రతిపక్షాల మౌనంపై వస్తున్న ఆరోపణలపై ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లుగా వైసీపీ అధికారంలో ఉందని, ఆక్రమణలు తొలగించాలంటే నిబంధనల మేరకు తొలగించండి.. టీడీపీ నాయకులకు అభ్యంతరం లేదని తెలిపారు. టీడీపీ నాయకులు మద్దాలి సర్వోత్తమరెడ్డి, షేక్ షంషుద్దీన్, దారా సురేష్, షేక్ బాబు, షేక్ నౌషాద్, సుహాసిని, మర్రి అనిల్, పోలమ్మ నందం మోహన్, తల్లం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం కొత్త ఎస్ఐగా బండి రామాంజనేయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకు ముందు గుడుపల్లె పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై గంగాధర నెల్లూరు మండలానికి వచ్చారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా చిన్న చిన్న తగాదాలు ఏర్పడి పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు ఎవరైనా కొంత మంది దళారులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే వారిపై పోలీసులు దాడి చేసి పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

తులసినాధం నాయుడుకు సత్కారం

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక కమిటీ అధ్యక్షులు పి.తులసినాధం నాయుడును తిరుపతికి చెందిన తెలుగు భాషోద్యమ సమితి నిర్వాహకులు శనివారం ఘనంగా సత్కరించారు. తెలుగు భాషోద్యమ సమితి 17వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా తులసి నాదం నాయుడు పాల్గొన్నారు. ఆయన చేస్తున్న తెలుగుభాషా సేవలకు గాను వార్షికోత్సవ పురస్కారంలో సత్కరించారు. తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్ష కార్యదర్శులు గంగవరం శ్రీదేవి, టెంకాయల దామోదరం, ఆచార్య గార్లపాటి దామోదర, అముదాల మురళి, వాకా ప్రసాద్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం బస్తాలు వితరణ

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: తిరుపతి పద్మావతీపురంలోని 'పాస్' మనోవికాస్ బుద్ధిమాంద్య, అనాధ పిల్లల సంరక్షణ కేంద్రానికి వాకర్స్ ఇంటర్నేషనల్ వారు 10 బస్తాల బియ్యం వితరణ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు ఆర్కాట్ కష్ణప్రసాద్ విచ్చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ లో భాగంగా పాస్ మనోవికాస్ కు బియ్యం బస్తాలు వితరణ చేశామన్నారు. సుబ్బారెడ్డి, రాయదుర్గం రామమూర్తి, మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రవికి ఘన సన్మానం

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉన్నం రవిని ఘనంగా శనివారం సన్మానించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ థియరీ పరీక్షల, స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ పెరుగుదలకు కషి చేసినందుకు ఆఫీసర్స్ క్లబ్‌లో ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల మూడు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, వివిధ అసోసియేషన్ల, ప్రాంతీయ సభ్యులు రవిని సన్మానించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని పాతపేట గ్రామపంచాయతీ పరిధిలో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై కథనం మేరకు వివరాలు.. బైరెడ్డిపల్లి టు కడప నత్తం జాతీయ రహదారిలోని కుప్పనపల్లి క్రాస్ వద్ద శుక్రవారం ఎస్సై వెంకట నరసింహులు తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా టీవీఎస్ ఎక్సెల్‌లో వస్తున్న వ్యక్తి వారిని చూసి పరారవ్వడానికి ప్రయత్నించగా అనుమానంతో పోలీసులు దగ్గరకెళ్లి పరిశీలించగా టీవీఎస్ వాహనంలో కర్ణాటక మద్యం 42 డేటా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అతనుకుప్పనపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి(75)ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ వెంకట నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు.

మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని బైరెడ్డిపల్లి, లక్కనపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, రాజంపేట పరిశీలకులు క్రిష్ణమూర్తి, మండల సచివాలయ కన్వీనర్ కార్తిక్, బైరెడ్డిపల్లి సర్పంచ్ వెంకటేష్, లక్కనపల్లి సర్పంచ్ కష్ణారెడ్డి, వైస్ సర్పంచ్ తనయుడు రాజేంద్ర, ప్రభాకర్ రెడ్డి, గోవింద్ రెడ్డి, బైరెడ్డిపల్లి మండలంలోని వైసీపీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై ఇంటింటికీ బ్యానర్లు వేస్తూ, ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాల గురించి కష్ణమూర్తి క్షుణ్ణంగా ప్రతి కుటుంబ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకలకు సిద్ధమవుతున్న చర్చిలు

ప్రజాశక్తి-నగరి: ఆదివారం నిర్వహించనున్న ఈస్టర్ వేడుకలను పురస్కరించుకొని పట్టణ పరిధిలోని చర్చిలకు విద్యుత్ కాంతులు వచ్చాయి. శనివారం చర్చిల వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ కాంతుల్లో చర్చిలు శోభాయమానంగా కనిపించాయి. దీంతో అటుగా వెళ్లే చూపరులను ఆకర్షించాయి.

ఉపాధ్యాయులపై సానుభూతి చూపండి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయులపై అధికారులు సానుభూతి కలిగి ఉండాలని వైఎస్ఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి శేఖర్ రెడ్డి కోరారు. శనివారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈఓ ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ప్రసంగించారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో టీచర్ అత్యవసరంగా సెలవు పెట్టవలసినపుడు పలు మండలాల్లో ఎంఈఓలు సహకరించడం లేదని, స్పాట్ వాల్యుయేషన్ విధులకు బాలింతలు, వికలాంగులు, రోగగ్రస్తులు, 58 సం॥ పైబడిన వారికి మినహాయింపు ఇవ్వాలి, స్పాట్ కేంద్రంలో గాలి, వెలుతురు, తాగునీరు మొదలగు కనీస వసతులు కల్పించాలని, పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు పి.ధనంజయ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జయకాంత్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు బీసీ సంఘర్షణ సమితి సమావేశం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో బీసీ సంఘర్షణ సమితి సమావేశం నిర్వహించనున్నట్లు శనివారం ఓ ప్రకటనలో బీసీ సంఘర్షణ సమితి నాయకులు పూసల రవి తెలిపారు. బీసీలు నేడు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పోరాట కార్యక్రమాన్ని రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు రవి పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు, బీసీ ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

IN THE COURT OF THE 5TH ADDL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
O.S.No.943 of 2021

Between:
1.T.H.Payani
2.T.P.Lochana
3.T.P. Teja Prakash ...Plaintiffs
And
P.Subramanyam .. ..Defendant

To **SUMMONS TO THE DEFENDANT**
P.SUBRAMANYAM
S/o Pidugu Kannaiah Chetty
D.No.8-730, Thotapalem,
Chittoor Town and District
Madam/Sir

Please take notice that the above named plaintiffs filed the above suit against you and the above suit is posted to **21-04-2023** for your appearance. Please be present before the said court on the said date at about 10-30 A.M either in person or through an advocate and to file objections if any, failing which the matter you will be set exparte in your absence.

Sd/- **P.V.GUNESWARAN, T.MOHAN, T.RAVI KUMAR**
Advocates,Chittoor
Chittoor, Dt.06-04-2023

బహిరంగ ప్రకటన

చిత్తూరు జిల్లా శాంతిపురం వాస్తవ్యులైన ఎ.అర్షద్, తండ్రి ఎ.అక్బర్ వారి సూచనలు మేరకు తెలియజేయడమేమనగా నా క్లయింట్ యొక్క ఒరిజినల్ విక్రయ దస్తావేజు నెం.291/2006 తేది: 21.02.2006 శాంతిపురం నుండి కుప్పంకు ప్రయాణిస్తుండగా దార పోయినది. సదరు విషయమై రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా వారు తేది. 23.01.2023న "నాట్ ట్రేసబుల్" సర్టిఫికెట్‌ను జారీ చేసి యున్నారు. సదరు పత్రము ఎవరికైనా దొరికిన యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోపు ఈ దిగువ తెలిపిన చిరునామాకు తెలియజేయ గలరు. అనంతరం వచ్చు అభ్యంతరములు, ఆక్షేపణల పరిశీలించబడవు.

SCHEDULE:Chittoor R.D., Kuppam Sub District, Santhipuram Mandal, Ralla buduguru Village panchayath, No.15, Ralla buduguru Village, Sy.No.130-1, D.No.2-140, bounded on East: Kuppam KGF Road, West: House of G.Munivenkatappa, North House of Haleem Basha, South: Part House of Akbar Basha, In between this East - West : 28 ft North to South: 7ft admeasuring 21.77 sq.yds of RCC House

ఎం.హరీష్, న్యాయవాది, తిరుపతి,
సెల్:9949995779

IN THE COURT OF THE HON'BLE II ADDL. CHIEF JUDGE CUM MACT CITY CIVIL COURT AT :: HYDERABAD
M.V.O.P.No. **1874** of **2022**

Between:
Syed Arsalan Naqvi ...Petitioner
AND
B Bhanu Prakash and others ...Respondents

To,
1. B Bhanu Prakash, S/o. B Guru Santaiah age : Major, Occ : Business, R/o. 11-52, Bungavari Palli, Somala, Chittoor District - A.P. 517 257.

Please take notice that the above petitioner have filed the case for grant of compensation for the Injuries sustained by him, in a Motor Vehicle accident which occurred on 06-05-2022, with Car under the limits of P.S. Chickballapura.
The above case is posted to **09-05-2023** at **10-30** AM for your appearance and counter. If you fail to appear before the Hon'ble Court on, specified date and time either on person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
K.ANAND REDDY
D.VENKAT RAMULU
Counsels for the Petitioner
Flat no 212, Jamuna Towers,
Malakpet, Hyderabad-500 036.
Cell : 9848052455, 9848051707